కొనలపై నిలిచే మంచు బిందువులు, చుట్టూ ప్రాకృతిక నిశ్శబ్దం ఇదంతా అనుభవిస్తూంటే మన మనస్సు అత్యద్భుతమైన అలౌకిక ఆనందపుటంచులకు చేరుతుంది.

డల్హౌసీకి దగ్గరలో ఉన్న మరో అతి సుందరమైన ప్రాంతం 'చంబ'. డల్హౌసీ నుండి 'రాణిఖేత్' ద్వారా వెళ్తే 49 కి.మీ. ఖజ్జియార్-కాలాటాప్‌ల గుండా వెళితే 46 కి.మీ. దూరంలో ఉంది 'చంబ'. దారి నిండా ఆకాశాన్ని తాకే కొండలు, పాతాళంలో ప్రవహించే నదులు, వంపులు తిరిగి వయ్యారంగా ప్రవహిస్తూ సుందరమైన స్త్రీ ఆకృతికి ప్రతిరూపంగా కనిపించే ఈ ప్రకృతి సౌందర్యం ఎటువంటి వారినైనా చలింప చేస్తుంది. చంబలో పదవ శతాబ్దానికి చెందిన 'చాముండ మందిరం' ఉంది. ఈ మందిరం గోడలపై ఉన్న వెన్నముద్దకై అత్రపడుతున్న బాలకృష్ణుని బొమ్మ మైమరిచేలా చేస్తుంది. , పులిచర్మం ధరించిన శివుడు ఆనందింపచేస్తాడు. మందిరం కొండపైన ఉండటంతో చంబ నగరం మొత్తాన్ని పై నుండి చూడవచ్చు. చంబ మార్కెట్‌కు దగ్గరలోనే ఆరు మందిరాలు కలసిన లక్ష్మీనారాయణ మందిరం ఉంది. 10 నుండి 14వ శతాబ్దం నడుమ నిర్మించిన మూడు శివమందిరాలు, మూడు విష్ణుమందిరాలు ఒకే కాంపౌండులో ఉండటం చూడవచ్చు. ఈ మందిరాలలో విగ్రహాలన్నీ పాలరాతివే. మందిర ప్రవేశ ద్వారానికి ఇరువైపుల గంగ, జమునలు కలశాల నుండి ధారగా నీరు అందిస్తూ, ప్రజలను ఆశీర్వదిస్తూ, అభయహస్తమిస్తున్నట్టు కనిపిస్తారు. ఈ మందిరం గోడలపై పార్వతి, గౌరీ ఉమ, దుర్గ రూపాలతో అర్ధనారీశ్వరుడి చిత్రపటాలున్నాయి.

సాహసికులకు 'చంబ' పర్యటన మంచి అవకాశం. 2 కి.మీ. దూరంలో ఉన్న సుభాష్ చాప్లీ సరస్సు వరకూ కాలినడకన వెళ్లటం మంచి అనుభవం. సూర్యోదయం కన్నా ముందే నడక ప్రారంభిస్తే అద్భుతంగా ఉంటుంది. చంబ నుండి 'పదార్వా' గుండా కాశ్మీర్‌లోని "కిష్వార్' వరకూ నడవటం మంచి అనుభవం. అడవి గుండా సాగే ఈ నడక మధురానుభూతిని మిగులుస్తుంది. ✥

పాఠకులు తమ పర్యటన అనుభవాలను రాసి పంపితే ప్రచురిస్తాం.





# గ్లామర్‌కోసం విక్రం కసరత్తు!

అపరిచితుడు చిత్రం అటు తమిళంలోను, ఇటు తెలుగులోను ఘనవిజయం సాధించడంతో విక్రం ఇప్పుడు తెలుగు అభిమానులకు హీరోగా మారాడు. దాంతో తెలుగులో విక్రమ్‌కు పెరిగిన క్రేజ్‌ని గుర్తించిన నిర్మాతలు విక్రమ్ తమిళంలో నటించిన చిత్రాలను వరుసగా తెలుగులో డబ్ చేసి విడుదల చేశారు. కాగా ఇటీవల విక్రమ్ నటించిన మజా చిత్రం అంతగా సక్సెస్‌ను సాధించలేకపోయింది. తాజాగా విక్రమ్ ఇప్పుడు భీమా అనే చిత్రంలో నటిస్తున్నాడు. బాడీలాంగ్వేజ్ కన్నా గ్లామర్‌గా కనిపిస్తే ఇంకా ఎంతోమంది అభిమానులను సంతోషపెట్టవచ్చని విక్రమ్ భావించినట్లు ఉన్నాడు. ఈ చిత్రంలో నటనతోపాటు గ్లామర్‌గా కనిపించాలని విక్రమ్ ప్రయత్నిస్తున్నాడు. దానికోసం విక్రమ్ సినిమాల్లో నటించేందుకు ముందే గ్లామర్ బాడీకోసం కసరత్తు ప్రారంభించాడు. కోయంబత్తూరులోని ఓ సహజయోగ ప్రకృతి చికిత్సా కేంద్రంలో ఇందుకు అవసరమైన చికిత్సను తీసుకున్నాడు. తన బరువును తగ్గించుకునేందుకోసం పదిరోజులపాటు ఆశ్రమంలో చికిత్స తీసుకున్నాడు. చికిత్స తరువాత విక్రమ్ ఇప్పుడు నూతనోత్సాహంతో చెన్నై చేరుకుని భీమా సినిమాలో గ్లామర్‌రూపం ప్రదర్శించేందుకు సిద్ధమయ్యాడు.